1987 దీపావళి కథల పోటీలో రు.700/-లు బహుమతి పొందిన కథ

# రాజమ్మ

## ‘సుజాతా, నేను కూడా రానా తల్లీ?’

## మెట్లు దిగుతున్న సుజాత క్షణం ఆగి, వెనక్కి తిరిగి

## ‘మీరా? మీరెందుకు?’ అంది అదోలా నవ్వి.

### ‘డాక్టరమ్మ పరీక్షలేవో చేస్తుంది కదా? భయం లేదా మరి?’

### అత్తగారి అమాయకత్వానికి ఫకాల్న నవ్వింది సుజాత.....

ఆ నవ్వుకి మనసు చిన్నబుచ్చుకున్నా వెంటనే సర్దుకు పోయింది రాజమ్మ అయినా తను సత్తెకాలపు మనిషి తనకేం తెలుసు గనుక?

రిక్షాయెక్కి వెళ్ళిపోతున్న కోడలిని చూస్తూ అలాగే వీది అరుగుమీద చతికిలబడి పోయింది చాలాసేపు

ఆమె మనసు నిండా ఒకటే ఆలోచన తను నానమ్మ కావాలి వచ్చీరాని మాటలతో తన మనవడు మమ్మమా మ్మ అంటూ తనవైపు ప్రాకుకుంటూ వస్తే తను అక్కున చేర్చుకుని ముద్దులతో ముంచెత్తి నిలువెల్లా పులకించి పోవాలి తన యీ చిన్న కోరిక తీరుతుందా?

రాత్రి సుజాత నాలుగు రోజులుగా నలతగా ఉంటోంది రేపు డాక్టర్‌కి చూపించు కోవాలన్నప్పుడు ముందు యెంతగానో కంగారు పడిపోయింది రాజమ్మ కాని అసలు విషయం గ్రహించుకున్నాక ఆనందం పట్టలేక పూజా మందిరంలోకి పరుగున వెళ్ళి భగవాన్ యిన్నాళ్ళకి నా పూజలందుకున్నావా తండ్రీ” అంటు సాష్టాంగపడిపోయింది ప్రక్కనే గోడకి తగిలించిన ఫోటో వైపు తిరిగి ఏమండీ



మీరు తాతయ్యా కాబోతున్నారండీ చూడండి తాతయ్యా అని పిలిపించుకునే అదృష్టం మీకు లేకపోయినా నేను నానమ్మా అని పిలిపించు కుంటానండీ ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రాజమ్మ కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి

తెల్లవారి లేచిన దగ్గర్నుంచీ రాజమ్మకు భూమ్మీద కాలు నిలవడం లేదు పదిగంటలు యెప్పుడవు తుందా సుజాత ఆసుపత్రికి వెళ్ళివచ్చి తన చెప్పిన ఆ శుభ వార్త ఎప్పుడు వేస్తుందా అని యెదురు చూస్తోంది ముందు తను కూడా సుజాతకి తోడుగా వెళ్ళాలనే నిశ్చయించుకుంది కాని తర్వాత యేమాలోచించుకుందో యేమో విరమించుకుంది. మళ్ళీ పాతికేళ్ళ తర్వాత తన యింట్లోకి తప్పటడుగులు వేసే చిన్నారి కృష్ణుడు వస్తాడు ... ఇంక మళ్ళీ గోరుముద్దలు జోలపాటలు లాలిపాటలు

రాజమ్మ ఆలోచనలు అలా అలా గతంలోకి ఒక్కసారిగా పాతికేళ్ళు వెనక్కి వెళ్ళిపోయాయి

★ ★ ★ ★ ★

కన్ను మూసే లోపల నిన్నొక బిడ్డతల్లిగా చూడాలనుకున్నాను తల్లీ నా కోరిక నెరవేర కుండానే ఆ భగవంతుడి పిలుపు వచ్చేసింది జగన్నాదంగారు రాజమ్మ తల నిమురుతూ రాజమ్మ చెంపల మీదుగా జాలువారుతున్న కన్నీరు తుడిచారు

తండ్రి చేతిని రెండు చేతులలోకి తీసుకుంది రాజమ్మ నాన్నా నాకు పిల్లలు లేరని మీరెందుకనుకుంటున్నారు? అక్కయ్య పిల్లలు నా వాళ్ళు కారా? నా మరిది పిల్లలు నా వాళ్ళు కారా? బాధపడకండి నాన్నా తండ్రిని అనునయించా లని అంటున్నా మనసులో యేదో తీరని వెలితిగానే ఉంది రాజమ్మకి

వాళ్ళంతా నీ వాళ్ళు యెలాగవుతారుతల్లీ నాది అన్న నలుసు నీ కడుపున పుట్టాలని నా ఆరాటం కాని మరి ఆ దేవుడు కరుణించలేదు ఏ అక్కయ్య పిల్లలనో నువ్వు అభిమానంతో చేరదీసినా 'పరవు' పరవే అవుతుంది గాని 'నీది కాదుగదా?' జగన్నాధంగారి గొంతు బాధతో పూడుకు పోయింది

చిన్నప్పటి నుండి జగన్నాదం గారికి పిల్లలంద రిలో 'రాజమ్మ అంటేనే ఒక విధమైన ఆప్యాయత పంచ ప్రాణాలు రాజీకి యే చిన్న కష్టం కలిగినా అతని మనసు విలవిల్లాడి పోయేది

జగన్నాదం గారి పెద్ద కొడుకు ప్రసాద్ బొంబాయిలో ఇంజనీరు పెద్దకూతురు హైమ ఎమెస్సీ చేసి డాక్టర్ శేఖర్ బార్యగా స్థిరపడింది. కడసారి కూతురు రాజమ్మ చదువు లేని కారణంగా రాజమ్మ పెళ్ళి కూడా ఒక పెద్ద సమస్యగా తయారయ్యింది తల్లిదండ్రులకి ఇరవై యేళ్ళు నిండుతున్నా సంబందం కుదరకపోయే సరికి దిగులుతో మంచం పట్టిన తల్లి తీరని కోరికతోనే కన్ను మూసింది. చివరి మఘియ వరకు ఏమండీ మన రాజి తల్లిని ఒక యింటి దానిగా చూడాలని ఉందండీ అంటూనే ప్రాణం విడిచింది

తల్లి పోయిన తర్వాత తండ్రితో రాజమ్మ అనుబంధం మరీ యెక్కువైంది ఒక తల్లిగా ఆ తండ్రిని సాకింది. కూతురిగా సపర్యలు చేసింది

మరో రెండేళ్ళకి రాజమ్మ పెళ్ళి గోపాలావుతో జరిగి పోయింది గోపాలావు పెద్దగా చదువుకోకపోయినా తల్లి దండ్రులు సంపాదించిపెట్టిన తరతరాల ఆస్తి ఉంది తండ్రి పరపతితో సంపాదించుకున్న చిన్న గుమాస్తా ఉద్యోగం ఉంది ఈ అన్నింటినీ మించిన మంచితనం అతని ఆస్తి రాజమ్మకు కలిసొచ్చిన యీ అదృష్టానికి నలుగురూ ఈర్ష్య చెందినా జగన్నాదం గారు మనసారా సంతోషిం చారు ముక్కోటి దేవతల ఆశీస్సులను తమ ఆశీస్సులుగా అందించారు

పిల్లాపాపలతో దీర్ఘ సుమంగళిగా కలకాలం వర్ధిల్లు తల్లీ అంటూ దీవించారు

ఆ తండ్రి దీవెనలే సారెలుగా అత్తవారింట అడుగుపెట్టిన రాజమ్మ కాలచక్రంలో అయిదేళ్ళు గడిచి పోయినా తల్లి అయే అదృష్టానికి నోచుకోలేదు తమ తర్వాత పెళ్ళి అయిన మరిది యేడాది తిరక్కుండానే తండ్రి అయ్యాడు ఒక మగబిడ్డకి తనకింక జన్మలో ఆ అదృష్టం లేదని తెలుసుకున్న రాజమ్మ కుమిలి కుమిలి యేడ్చింది వంశోద్ధారకుడు కలగలేదనే బాదతో అత్త మామం సూటీ పోటీ మాటలు గొడ్రాలిగా ముద్ర వేసిన సంఘం కాకుల్లా పొడుచుకు తినే లోకుల మాటలు ఆమెనెంతగానో కృంగదీసాయి దుఃఖాన్ని యెంత గుండెల్లోనే అదిమి పెట్టినా మనసు అట్టడుగు పొరల్లో దాగిన ఆ మాతృత్వపు కోరిక ఉన్నట్టుండి పైకి పెల్లుబికి రాజమ్మ చెంపలను తడిపేసేది తన మనసులోని కోరిక ఓసారి భర్త ముందు బయట పెట్టింది. కాని ఎవర్నో పెంచుకుంటే వాడు 'మన కొడుకు యెలాగవుతాడు రాజీ? అన్న భర్త అభిప్రాయంతో ఏకీభవించ లేక పోయింది

ఈ దిగులుకి తోడు తండ్రి మరణంతో మరింతగా కృంగిపోయింది రాజమ్మ

మరో ఆర్నెల్లకి రెండవ కాన్పులో భార్య బిడ్డ



మరణించగా మరిది జీవితం క్రొత్త మలుపు తిరిగింది మరిది పెద్దకొడుకు ఏడ్నర్థం రఘు పెద్ద తండ్రి దగ్గరికి చేరాడు ఏక్షణాన రఘును రాజమ్మ అక్కున చేర్చుకుందో గాని ఆ యిద్దరి మధ్య విడదీయరాని బంధం పెన వేసుకు పోయింది రఘు రాజమ్మ గోపాత్రావులు యిద్దరికీ బాగా మాలిమి అయ్యాడు బిడ్డకి సవతి తల్లి పెంపకం యిష్టం లేని మరిది రఘుని శాశ్వతంగా అన్న వదినల దగ్గర వదిలి పెట్టాడు ఇప్పుడింక రాజమ్మకి యేలోటూ లేదు అసలు ఆలోచించే తీరికే లేదు చేతినిండా పని రఘు ఆటపాటలతో చిన్నారి చేష్టలతో ఆ దంపతులకి కాలగమనమే తెలియలేదు రాజమ్మ తాను గొడ్రాలినన్న విషయమే మర్చి పోయింది. రఘు అమ్మా అని పిలిచినప్పుడు రాజమ్మ శరీరంలోని అణువణువూ పులకించి పోయేది. అరక్షణం రఘు కంటబడకపోయినా అరికాలు వెచ్చగా ఉన్నా రాజమ్మ మనసు విలవిల్లాడేది

కాలక్రమేణా రఘు రాజమ్మ కొడుకైపోయాడు

★ ★ ★ ★ ★

ఉన్నదానితో తృప్తిగా బ్రతుకుతున్న రాజమ్మ బ్రతుకు గుండెపోటుతో భర్త మరణించడంతో మరో మలుపు తిరిగింది అప్పటికి రఘు స్కూల్ ఫైనల్‌లో ఉన్నాడు

చుక్కాని లేని పడవ అయింది రాజమ్మ స్థితి రఘు కోసం రఘు భవిష్యత్తు కోసం కొండంత ధైర్యంతో నిలబడింది తండ్రి దీవెన గుర్తొచ్చి నప్పుడల్లా తనలో తానే నవ్వుకునేది రాజమ్మ పిచ్చి నాన్నా పిల్లాపాపలతో దీర్ఘ సుమంగళిగా జీవించమన్నావు కదూ? అంతటి అదృష్టం కూడానా యీ రాజమ్మకి? అని

★ ★ ★ ★ ★

అత్తయ్యా నాకేదో భయంగా ఉంది ఆయన కూడా ఊళ్ళో లేరు' కళ్ళల్లో నీరు నింపుకున్న సుజాత బేల ముఖం చూసి రాజమ్మ కళ్ళు కూడా చెమ్మగిల్లాయి ఏం చేయాలో తోచక ఆతృతగా ముందుకి వచ్చి సుజాత యెత్తైన పొట్టని చేత్తో తడిమి చూసింది తన కంటికి వెలుగు తన ఆశల ప్రతిరూపం మరికాస్సేపట్లో తన చేతుల్లోకి రాబోతున్నాడు అంతటి ఆవేదనలోను రాజమ్మ కళ్ళు ఆనందంతో మెరిసాయి

పర్వాలేదమ్మా కాస్త ఓపికపట్టు పనసపండు లాంటి కొడుకు పుడతాడు కోడలికి ధైర్యం చెప్పిందే గాని మనసంతా అధైర్యంగానే ఉంది ఇది సుజాతకి రెండవ కాన్పు ఈసారైనా పుట్టిన బిడ్డ దక్కితే యేడు కొండలు నడిచి యెక్కుతానని మ్రొక్కుకుంది రాజమ్మ డాక్టర్ చెప్పిన మాటలు యింకా చెవుల్లో గింగురు మంటున్నాయి అమ్మాయికిదే ఆఖరి కాన్పు కావాలి లేకపోతే తల్లికి ప్రాణగండం

ఆ మాటలు గుర్తొచ్చినప్పుడల్లా రాజమ్మకి ముచ్చెమటలు పోస్తున్నాయి ఈ ఒక్క అవకాశం చేజారిపోతే సుజాత కింక తల్లి అయే అదృష్టంలేదు... భగవాన్ అలా జరగకూడదు. నా కోడలికి నా పోలిక రాకూడదు...

సుజాత అనుభవిస్తున్న ప్రసవ వేదన ఒకవైపు, మరో వైపు యేదో అవ్యక్తమైన భయం రాజమ్మ పిచ్చి పట్టిన దానిలా డాక్టర్ సౌజన్య గదివైపు పరుగుతీసింది కాళ్ళు పట్టుకు బ్రతిమాలింది పరిస్థితి నర్థం చేసుకోమని అర్థించింది డాక్టర్ యిచ్చిన అభయం ఆమెకు కొండంత ధైర్యాన్నిచ్చింది

★ ★ ★ ★ ★

గదిలోకి అడుగు పెట్ట బోయిన రాజమ్మ సుజాత మాటలకి టక్కున గుమ్మంలోనే ఆగిపోయింది

'ఏమండీ . . బాబు అచ్చం మీ లాగే ఉంటాడు కదండీ '

ఊహూ . నీ పోలికే... రఘు అంటున్నాడు

ఏం పేరు పెట్టాలనుకుంటున్నారు?

నువ్వు చెప్పు

ముందు అడిగినది నేను మీరే చెప్పాలి

గోపాలకృష్ణ అని పెడదాం ఊపిరి బిగబట్టి కొడుకు సమాధానం కోసం యెదురు చూస్తున్న రాజమ్మ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది ఆ పేరు విన్న సుజాత మాత్రం ముఖం ప్రక్కకి త్రిప్పుకుంది అర్థాయుష్షుతో పోయిన ఆయన పేరెందుకు? ఇంకేదైనా పెట్టండి ఆపై సంభాషణ వినలేక రాజమ్మ ప్రక్కకి తప్పుకుంది

బాలసారెనాడు మనవడికి వంశీ అని నామ కరణం చేయడం చూసి నిర్లిప్తంగా ఉండి పోయింది రాజమ్మ ఏ పేరు పెట్టుకుంటేనేం? పదికాలాల పాటు చల్లగా ఉంటే చాలు ' అనుకుంది మనసులోనే

ఇంకొక వారం రోజుల్లో కొడుకు కోడలుతో బయల్దేరాలి ఆ ఊళ్ళో తనకున్న వ్యవహారాలవీ త్వరత్వరగా సెటిల్ చేసుకుంటోంది మనవడితో ఊరికి ప్రయాణమంటే ఆవిడకి ఆకాశాన్నందుకున్నట్లుగా ఉంది చుట్టు ప్రక్కల అమ్మలక్కలు హాస్యమాడారు మళ్ళీ ఎప్పుడు రాక? మనవడి దగ్గరే సెటిలైపోతారా? అంటూ

రాజమ్మ ఉంటున్న యిల్లు అద్దెకివ్వడానికి నిర్ణయించుకుంది వారం రోజులు ముందునుంచీ సామాన్లవీ సర్దుతూనే ఉంది ఆ హడావుడి యింతా అంతా కాదు వంశీ కి కావల్సినవన్నీ ఒక పెట్టెలో విడిగా సర్దింది పట్టె మంచం కూడా పట్టుకు వెడితే బాగుండును తల్లీ పిల్లడు పడుకునేందుకు బాగుంటుందను కుంటూ రఘు నా విషయం అడుగుదామని బయల్దేరింది రఘు సుజాత యేదో ఘర్షణ పడుతున్నట్లు గమనించి గుమ్మం బయటే ఆగిపోయింది

అత్తయ్య కూడా వస్తున్నారా మనతో?'

అవును ఏం? నేనే రమ్మన్నాను ఒంటరిగా యిక్కడ యెన్నాళ్ళని ఉంటుంది పైగా యిప్పుడు మనవడితో కాలక్షేపం కూడా ఉంటుంది నువ్వూ, నేనూ యిద్దరం బయట ఉద్యోగాలకి వెళ్ళిపోతే వంశీ ని కంటికి రెప్పలా చూసుకుంటుంది '

వంశీ ని చూసుకునేందుకు అక్కడ చాలా కేర్ సెంటర్‌లున్నాయి


సుజాతా! దాదాపు అరిచినట్లుగా అన్నాడు రఘు

ఎందుకలా అరుస్తారు? పైగా ఆవిడకి పిల్లలని యెలా పెంచాలో యేమిటో యేం తెలియదు ' అంతా పాతకాలం పద్ధతులు ఏమైనా చెప్తే ఊరంత కోపం నీట్‌నెస్ లేదు ఏ చేతులతో పడితే ఆ చేతులతోనే యెత్తుకుంటూ ఉంటారు ' 'వద్దం'టే మానరు అలా చేస్తే బాబుకి ఇన్‌ఫెక్షన్స్ అవీ వస్తాయంటే అర్థం చేసుకోరు వంశీ పెద్ద వాడయే వరకు ఆవిడ నిక్కడే ఉండనివ్వండి ఆ తర్వాత తీసుకువెళ్దాం

'సుజాతా నన్ను పెంచి పెద్ద చేసింది అమ్మకి పిల్లల పెంపకం తెలియదంటావా? ఇంటికో పెద్ద దిక్కు, వంశీ' కి సంరక్షణ బాగుంటుంది అమ్మని తీసుకువెళ్దాం.

మిమ్మల్ని పెంచారు మోసి కనలేదుగా అందుకే అంటున్నాను ఆవిడకేం తెలియదని '

కోడలి నోటంట ఆ చివరి మాటలు రాజమ్మ చెవులకు కర్ణకఠోరంగా విన్పించాయి తను





దీపిక
చిత్రం ఎ ఉష

# దీపమాత

కాటుకలు దిద్దు కారు చీకటులలోన
కొట్టుమిట్టాడు చున్న లోకులను గాంచి
వెలుగు రేఖలు ప్రసరింపవే శుభాంగి
జాలిగల తల్లి! దివ్య దీపాల వెల్లి!

గుండెలను కోరి దహియించుకొనుచు మంద
హాస చంద్రిక లందించు నమృతమూర్తి
ఈయమావాస్య చీకటు లెన్ని యెని
నిలువగలవటే నీదు సాన్నిధ్య మందు!

విమల విజ్ఞానమునకు దీపికవు నీవు
నవ్యభావనంబులకు చిహ్నంబు నీవు
శాంతి సౌభాగ్యముల కలశంబు నీవు
దివ్యజీవన సందాత! దీపమాత!

—ఎం పి జానుకవి

పాతికేళ్ళుగా మర్చిపోయిన తన వంధ్యత్వాన్ని వెలికి తీసాయి దుఃఖమంతా ఉండ చుట్టుకున్నట్లు గొంతులో అడ్డుపడి ఆమె కళ్ళు శ్రావణ మేఘాల్లా వర్షిస్తున్నాయి తను పిల్లాడిని పెంచ లేదా? తను శుభ్రంగా లేదా? తనకు తెలియని యెన్ని విషయాలు తెలియజెప్పింది ?

అలా గదిలో గోపాల్రావు గారి ఫోటో ముందు ఎంతసేపు యేడ్చిందో తెలియదు గాని రాజమ్మ కళ్ళు ఎర్రగా ఉబ్బి పోయాయి భుజంమీద యెవరిదో చేయిపడటంతో-ఉలిక్కిపడి తలెత్తింది. ఎదురుగా రఘు కళ్ళనిండా నీళ్ళతో తల్లినే తదేకంగా చూస్తున్నాడు 'అమ్మా' అతని గొంతు దుఃఖంతో పూడుకు పోయింది

రాజమ్మ మనసు రాయి చేసుకుంది రఘు రేపే ప్రయాణం కదా యేర్పాట్లు చూడు అలా కూర్చుంటే యెలా?' రఘుని మాటలలో పెట్టడానికి ప్రయత్నిస్తు లేచింది

'అమ్మా' – ఏదో చెప్పబోయి నోరు రాక అర్ధోక్తిలోనే ఆగిపోయాడు

రాజమ్మ వెనుదిరిగి నవ్వింది. నాకు తెలుసురా నువ్వు చెప్పబోయేది అక్కడికి వెళ్ళి యిల్లు అదీ కాస్త పెద్దది చూసుకుని వచ్చి నన్ను తీసుకు వెళ్తానంటావు అంతే కదా? నాకు కూడా యిక్కడ చక్కబెట్టుకోవలసిన పనులు కొన్ని ఉన్నాయి ప్రస్తుతానికి మీరిద్దరూ వెళ్ళండి పిల్లాడు మాత్రం జాగ్రత్త'

తల్లి మాటలకి పెద్ద బరువు దిగిపోయినట్లుగా ఫీలయాడు రఘు ఫర్వాలేదమ్మా నేను ఆఫీసుకి వెళ్ళే త్రోవలోనే 'అశ్విని బేబీ కేర్ సెంటర్ ఉంది రోజూ వెళ్ళే ముందు అక్కడ దిగబెట్టి ఆఫీసు నుంచి వెళ్ళేటప్పుడు పికప్ చేసుకుంటాం అక్కడ పిల్లల్ని చాలా బాగా చూస్తారమ్మా ' రఘు లేచి ప్రయాణం యేర్పాట్లలో మునిగి పోయాడు

రాజమ్మ జీవచ్ఛవంలా తిరుగుతోంది మనవడితో ముచ్చటగా ఆడుకోనేలేదు దూరంగా వెళ్ళి పోతున్నాడు మళ్ళీ యెన్నాళ్ళకో? మనసంతా అల్లకల్లోలంగా ఉంది మళ్ళీ తనకి ఒంటరితనం తప్పదు.. ప్రాణాలన్నీ వంశీ మీదే ఉన్నాయి

సుజాతా, పిల్లడు జాగ్రత్తమ్మా వాడి ఆట పాటలన్నా ఉత్తరాలు రాస్తూ ఉండండి చదువుకుని సంతోషిస్తాను రాజమ్మ కళ్ళు వర్షిస్తూండగా మనవడ్ని గాఢంగా ముద్దు పెట్టుకుని కోడలి కందించింది సుజాత వెంటనే కర్చీఫ్‌తో పిల్లాడి ముఖం అంతా తుడవడం ఆమె హావభావాలు గమనించి పేలవంగా నవ్వుకుంది.

వాళ్ళు వెళ్ళి పోయిన గంట వరకు 'వంశీ' లేని యింట్లో అడుగు పెట్టడం యిష్టం లేక అక్కడే అరుగుమీద కూలబడి పోయింది రాజమ్మ

* * * * *

సంవత్సరం గిర్రున తిరిగింది ఈ మద్యకాలంలో రఘు మూడు నాలుగు ఉత్తరాలు రాసాడు రాజమ్మకి కాని జాబు లేదు మొట్ట మొదట రాసిన దానికి మాత్రం వెంటనే సమాధానం రాసింది 'బాబుని జాగ్రత్తగా చూసుకోమని చెప్పండి నా మనసంతా వాడి మీదే ఉంది అంటూ ఆ తర్వాత మరి యెన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు ఎంత కాదనుకున్నా తల్లిని చూడా లన్పించి బయలు దేరాడు రఘు సుజాత రానంది కాని రాజమ్మ అక్కడ లేదని సంవత్సరం క్రితమే తన దగ్గరికి బయల్దేరి వచ్చిందనీ చుట్టు ప్రక్కలవాళ్ళు చెప్పడంతో రఘు కంగారు పడ్డాడు దగ్గర, దూరపు బంధువులనందరినీ బోగట్టా చేసాడు కాని ప్రయోజనం లేకపోయింది నిరాశతో యింటికి తిరిగి వచ్చాడు


ఏమండీ బాబుని చాలా బాగా చూసుకుంటున్నారండీ సెంటర్ లో నాకంటే కూడా శ్రద్ధగా చూస్తున్నారు సుజాత మాటలు యాంత్రికంగా వింటున్నా రఘు మనసంతా తల్లి చుట్టూనే తిరుగుతోంది సవతి తల్లి నీడలో పెరగవలసిన తనకు కన్నతల్లి ప్రేమ రుచి చూపించిన ఆ మాతృమూర్తికి తనేం మిగిల్చాడు మనఃక్షోభ తప్ప? పశ్చాత్తాపంతో అణువణువూ దహించుకు పోతోంది అసలు అమ్మ బ్రతికే ఉందా? లేక ? ఒక్కసారిగా ఆ ఊహకి రఘు ఒళ్ళు జలదరించింది

వంశీ మూడేళ్ళ వాడయ్యాడు కాన్వెంటులో జాయిన్ చేసారు

ఏమండీ రేపే వంశీ ని సెంటర్ నుండి ఆఖరి సారిగా తీసుకు రావడం అక్కడ ఆయాల కేమైనా పంచి పెడదామండీ సుజాత గోముగా భర్త నడిగింది రఘు అన్యమనస్కంగానే 'నీ యిష్టం అన్నాడు

మూడేళ్ళుగా బాబుని చాలా జాగ్రత్తగా చూసుకున్నందుకు చాలా థాంక్సండీ రఘు 'బేబీ కేర్ సెంటర్ యజమాని శ్రీమతి సరోజినిని కలిసి తన దన్యవాదాలర్పించాడు

ఆమె నవ్వింది 'ఇందులో నా గొప్పతన మేముందండీ అంతా ఆయాలదే అండ్ దే ఆర్



ఫైడ్ ఫరిట్

రఘు సుజాత తాము తెచ్చిన చీరలను సరోజిని కిచ్చి ఆయాలకి పంచి పెట్టమని చెప్పారు. 'వంశీ' రఘుతో వెళ్ళనని మొరాయిస్తున్నాడు. ఏడుపు లంకించుకున్నాడు ఆ య మ్మ కాలి (కావాలి)' అంటూ మొండి పట్టుపట్టి కూర్చున్న వంశీని చూసి సుజాతకి ఒళ్ళు మండింది గట్టిగా వీపు మీద చరిచింది దాంతో వంశీ గుక్క త్రిప్పుకోకుండా యేడ్వడం ప్రారంబించాడు లోపల నుంచి అయమ్మ పరుగున వచ్చి వంశీ ని అందుకుంది... వాడు ఆ య మ్మా అంటూ ఆమె నల్లుకు పోయాడు

రఘు ఆశ్చర్యంతో నోరు తెరిచి 'అ... మ్మా' అన్నాడు సుజాత అత్తయ్యా అంది.

క్షమించండి మనవడికి దూరంగా ఉండలేక ... యిలా వచ్చేసాను వాడితోడిదే లోకం అనుకున్న నాకు వేరే దిక్కు తోచలేదు రాజమ్మ కళ్ళనిండా నీళ్ళు

అమ్మా యింటికి వెళ్దాం రామ్మా...' రఘు అర్థించాడు

'నేను యిప్పుడు అమ్మను కాదురా ఆయమ్మను... నన్నిలాగే ఉండనీ రాజమ్మ గొంతు జీరపోయింది.

'అది కాదమ్మా వంశీ కోసం నీ మనవడి కోసం.. రావా? రఘు కన్నీటికి చలించలేదు రాజమ్మ. వేదాంతిలా నవ్వింది నాకు వంశీ ఒక్కడే మనవడు కాదురా.. యిక్కడికి రోజూ వచ్చే పిల్లలంతా నా

# దీపావళి

తారాపథంలో ధరలు
తారాజువ్వలై తాండవిస్తుంటే

అవనిలో అరాచకాలు
ఆటంబాంబులై పేలుతూ వుంటే

అన్యాయాలు అక్రమాలు
పిసింద్రీలై చిందు లేస్తుంటే

కలహాలు కార్పణ్యాలు
చిచ్చు బుడ్లై ప్రజ్వలిస్తుంటే

దీపావళి కాదు

క్రాంతి పథాన పయనించినప్పుడే
మానవాళికి నిజమైన దీపావళి
నరకాంతక దరహాస రేఖావళి

–వేమూరి మాధవ

## ఆయమ్మ

మనవలే... కన్నతల్లికి ఒక్కడే గాని పెంచిన తల్లికి ప్రపంచమంతా పిల్లలే! 'వంశీ' కోసం వీళ్ళందరినీ దూరం చేసుకోమంటావా?' వంశీని మరోసారి గాఢంగా ముద్దులాడి రఘు చేతి కందించింది

'అత్తయ్యా మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను నన్ను మన్నించి యింటికి పదండి సుజాత రాజమ్మ పాదాలను తాకింది కోడలిని లేవనెత్తి రాజమ్మ కళ్ళు రెండూ తుడిచింది ఇందులో నీ తప్పేముంది? అంతా నా దురదృష్టం

ఇంకేదో చెప్పాలనుకున్న రాజమ్మ మాటలు నోటిలోనే ఆగిపోయాయి నీ కన్నకొడుకు అనుకుంటున్న యీ వంశీ నీ పేగు తెంచుకుని పుట్టలేదు సుజాతా రెండవసారి కూడా బిడ్డ చనిపోయాడన్న వార్త నీకు చెప్తే యే పరిణామాలకి దారి తీస్తుందోనని నేను డాక్టర్ని బ్రతిమాలి అప్పుడే పుట్టిన ఒక అనాదని నీ ప్రక్కలో పడుకోబెట్టాను ఈ చేదు నిజం రఘుకి కూడా తెలియదు నాలో నేను దిగమ్రింగుకున్నాను ఈ రహస్యం లోకానికి తెలిస్తే నా లాగే నీ జీవితం కూడా దుర్భరమవుతుందని సుజాతా బంధాలకీ అనుబందాలకీ పేగు పంచుకునే పుట్టక్కర్లేదమ్మా పెంచిన మమకారం చాలు అని చెప్పాలనుకున్న రాజమ్మ నోట మాట రాక మౌనంగా కన్నీరు కారుస్తూ నిలబడిపోయింది

కనుమరుగై పోతున్న ఆటో లో నుంచి రాజమ్మకి 'ఆయమ్మా – ఆయమ్మా అన్న యేడుపు వినిపిస్తుంటే చెవులు మూసుకుని వెనుదిరిగింది 'ఆయమ్మను కాదురా నానమ్మను అనాలనుకుంది అన్నాననుకుంది కాని అనలేకపోయింది ! □

